

అడుగంటిన ఆశలు

కంభం చెరువులో నీటిమట్టం అడుగంటింది. అయినా ఇరిగేషన్ అధికారులు తూములు ఎత్తి నీళ్లు వదలడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

- 8లో..



10న మెగా పేరెంట్స్-టీచర్స్ మీటింగ్

మెగా పేరెంట్స్-టీచర్స్ మీటింగ్‌లు పండుగలా నిర్వహించాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ గోపాలకృష్ణ ఆదేశించారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
37 /29

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

నేడు ఘనంగా వైఎస్సార్ జయంతి వేడుకలు

ఒంగోలు సిటీ: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించనున్నట్లు పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు గొంగటి శ్రీకాంత్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మెగా రక్తదాన శిబిరం, ఉచిత కంటి పరీక్షలు నిర్వహిస్తారన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, పార్టీ ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి, ఒంగోలు నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జ్ చుండూరి రవిబాబు పాల్గొననున్నట్లు తెలిపారు. అన్ని నియోజకవర్గాల యూత్ అధ్యక్షులు, మండల అధ్యక్షులు, అన్ని అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

యూనివర్సిటీకి ప్రత్యేక గుర్తింపు తెస్తాం

- నూతనంగా విధుల్లో చేరిన పలువురు అడ్మిన్లు

ఒంగోలు సిటీ: విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేసి నూతనంగా ఏర్పడిన ఆంధ్ర కేసరి విశ్వ విద్యాలయానికి ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చేందుకు శాయశక్తులా కృషి చేస్తామని ఏకేయూలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన కళాశాలల అభివృద్ధి మండలి (సీడీసీ) డీన్ డాక్టర్ కే.వి.ఎన్.రాజు, నూతనంగా ఏకేయూ పరీక్షల నియంత్రణ అధికారి (సి.ఈ)గా విధుల్లో చేరిన ప్రొఫెసర్ జి.సోమశేఖర్ పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం స్థానిక ఆంధ్ర కేసరి యూనివర్సిటీలో వారి నూతన విభాగాల్లో పదవీ బాధ్యతలు స్వీకరించారు. వీరికి యూనివర్సిటీకి చెందిన సహచర అధ్యాపకులు, సిబ్బంది, పలు కళాశాలల యాజమాన్యాల ప్రతినిధులు అభినందనలు తెలిపారు.

'అక్షర ఆంధ్ర' ను విజయవంతం చేయాలి

- సమన్వయ కమిటీ సమావేశంలో జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ గోపాలకృష్ణ



ఒంగోలు సబర్బన్: నిరక్షరాస్యులైన వయోజనులను కూడా అక్షరాస్యులుగా మార్చే 'అక్షర ఆంధ్ర' కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ ఆదేశించారు. ఇందుకు సంబంధించి వివిధ శాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం సోమవారం ఆయన అధ్యక్షతన ప్రకాశం భవనంలో నిర్వహించారు. వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'ఉల్లాస్' పథకంలో భాగంగా 2025-26 విద్యా సంవత్సరంలో 'అక్షర ఆంధ్ర' అనే ప్రత్యేక సాక్షరతా కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించినట్లు వయోజన విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ జగన్ మోహన్‌రావు ఈ సందర్భంగా వివరించారు. ఈ విద్యా సంవత్సరంలో జిల్లాలో 1,29,497 మందిని అక్షరాస్యులుగా చేయాల్సి ఉందన్నారు. ఆగస్టు 7 నుంచి రాష్ట్రవ్యాప్తంగా బోధన ప్రారంభమయ్యేలా ప్రభుత్వం కార్యాచరణ ప్రణాళిక రూపొందించినందున, దీనికి సంబంధించిన వాలంటీర్ టీచర్ల గుర్తింపు, శిక్షణ కార్యక్రమాలను ప్రణాళిక మేరకు ఈ నెలలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో జెడ్పీ సీఈవో చిరంజీవి, డీఈవో కిరణ్ కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కరువు జిల్లాగా పేరొందిన జిల్లాకు వెలిగొండ వచ్చింది. గుండ్లకమ్మ పరుగులు పెట్టింది. రామతీర్థం జలకళతో నవ్వడి చేసింది. రైతు మోముపై చిరునవ్వు తొణికిసలాడింది. జిల్లా కేంద్రం ఒంగోలుకు మెడికల్ కళాశాల వచ్చింది. నాడు వైఎస్ రాజశేఖరరెడ్డి వేసిన పునాదులు జిల్లా అభివృద్ధికి బాటలు వేశాయి. అప్పటిదాకా కరువు కాటకాలతో విలయతాండవం చేసిన జిల్లాలో ఆయన నడిచినంత మేరా పచ్చనిపైర్లు పలకరించాయి. ఆయన వారసుడిగా వచ్చిన వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తండ్రి స్ఫూర్తితో పాలన కొనసాగించారు. మార్కాపురంలో మెడికల్ కళాశాలకు శ్రీకారం చుట్టారు. వెలిగొండ ప్రాజెక్టు పనులు పరుగులు పెట్టించారు. సంక్షేమ పథకాలు అమలు చేసి అన్ని వర్గాలకు అండగా నిలిచారు. నేడు కూటమి పాలన అంతా తిరోగమనంలో సాగుతోంది. వెలిగొండపై నిర్లక్ష్యం.. మెడికల్ కళాశాల వెనక్కి..ప్రతిష్టాత్మకమైన ట్రిపుల్ ఐటీపై నీలి నీడలు.. ఇలా ఏడాది కాలంలో కూటమి పాలకులు జిల్లాకు చేసిన అన్యాయంపై జిల్లా వాసులు మండిపడుతున్నారు. నేడు వైఎస్సార్ జయంతి సందర్భంగా నాటి రాజన్న పాలనను జిల్లా ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు.

అభివృద్ధికి బాటలు.. సంక్షేమ పరవళ్లు!

గుండ్లకమ్మ ప్రాజెక్టు వద్ద వైఎస్సార్ (ఫైల్)



- వైఎస్సార్ హయాంలోనే శరవేగంగా వెలిగొండ నిర్మాణం
- గుండ్లకమ్మ, రామతీర్థంలకు జలసవ్వడులు
- రైతు రుణమాఫీతో అన్నదాతలకు అండగా నిలిచిన మహానేత
- వైఎస్సార్‌సీపీ పాలనలో పూర్తయిన వెలిగొండ ప్రాజెక్టు పనులు
- మార్కాపురంలో మెడికల్ కళాశాల పనులు వేగవంతం
- నేడు కూటమి పాలనలో అంతా తిరోగమనం

సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

జిల్లాలో కరువు విలయతాండవం చేస్తున్న సమయంలో అధికారంలోకి వచ్చిన వైఎస్ రాజశేఖర రెడ్డి వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లోని 4.477 లక్షల ఎకరాలకు సాగునీరు, 15.20 లక్షల మంది ప్రజలకు తాగునీరు అందించే లక్ష్యంతో ప్రాజెక్టుకు రూపకల్పన చేసి కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేశారు. శరవేగంగా పనులు సాగుతున్న సమయంలో ఆయన మరణంతో ప్రాజెక్టుకు గ్రహణం పట్టింది. 2014 నుంచి 2019 చంద్రబాబు పాలనలో వెలిగొండ దాదాపుగా మూలనపడింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక సీఎంగా జగన్ మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన వెంటనే వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేసేందుకు ప్రాధాన్యత ఇచ్చారు. దాదాపుగా పనులన్నీ పూర్తి చేసి ప్రాజెక్టును జాతికి అంకితం చేశారు. ఎన్నికల కోడ్ వల్ల నిలిచిన అరకొర పనులు పూర్తి చేయడానికి కూటమి ప్రభుత్వానికి మనసురావడం లేదు. బడ్జెట్లలో కేవలం రూ.300 కోట్లు కేటాయించారంటే ఈ ప్రాజెక్టుపై వారి శ్రద్ధ అర్థం చేసుకోవచ్చని ప్రజా సంఘాలు విమర్శిస్తున్నాయి. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీకి రూపాయి కూడా కేటాయించకుండా ప్రాజెక్టు పనులు పూర్తి కావడం అసాధ్యం.



వెలిగొండ ప్రాజెక్టు రెండు టన్నెళ్లు


పేద విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ సాయం..

పేదరికం కారణంగా ఏ ఒక్కరి చదువులు ఆగిపోకూడదంటూ వైఎస్ రాజశేఖర రెడ్డి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ప్రారంభించారు. లక్షలాది మంది నిరుపేద విద్యార్థులు ఉన్నత చదువుల నభ్యసించారు. చంద్రబాబు పాలనలో ఆ పథకం నీరుగారడంతో పేద విద్యార్థులు ఇబ్బంది పడ్డారు. వైఎస్ జగన్ ప్రభుత్వం వచ్చాక తిరిగి జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన పథకాలను అమలు చేయడం ద్వారా విద్యార్థులకు అండగా నిలిచారు. గత ఐదేళ్లలో 3,09,817 మంది విద్యార్థులకు విద్యా దీవెన, 2,72,315 మంది విద్యార్థులకు వసతి దీవెన ద్వారా కోట్ల రూపాయల సాయం అందించారు. మళ్లీ ఇప్పుడు వచ్చిన కూటమి ప్రభుత్వం ఏడాదిగా విద్యార్థులకు సాయం అందించకుండా వారి భవిష్యత్తుతో ఆటలాడుతోంది

మహిళలకు అండగా...

వైఎస్సార్ పాలనలో డ్వాక్రా మహిళలకు పావలా వడ్డీతో రుణాలు ఇచ్చారు. ఆ తరువాత వైఎస్ జగన్ ఒక అడుగు ముందుకేసి ఎలాంటి వడ్డీలు లేకుండా, తిరిగి చెల్లించాల్సిన అవసరం లేకుండా వైఎస్సార్ చేయూత పథకం పేరుతో 45 నుంచి 60 ఏళ్ల వయసున్న ఎస్సీ, ఎస్టీ మైనారిటీ మహిళలకు ఏడాదికి రూ.18,750 వారి బ్యాంకు ఖాతాలో జమ చేసి సంక్షేమ పథకాల్లో కొత్త ఒరవడి సృష్టించారు. కూటమి ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు పేరుతో దగా చేసింది. ఆడబిడ్డ పథకం పేరుతో 18 ఏళ్ల నుంచి 60 ఏళ్ల వరకు ప్రతి మహిళకు నెలకు రూ.1500 బ్యాంకులో జమ చేస్తామని చెప్పి ఆ పథకాన్నీ అటకెక్కించింది. జిల్లాలో 7,00,012 మంది మహిళలకు ఆడబిడ్డ పథకం పరిధిలో ఉన్నారు. ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీ ప్రకారం తొలిఏడాది రూ.1,05,00,18,000 అందక మహిళలు మోసపోయారు. ఉచిత బస్సు కోసం 11,02,82 మంది మహిళలు ఎదురు చూస్తూనే ఉన్నారు.

రైతుకు స్వర్ణయుగం..



రైతు రుణమాఫీ ఫైలు మీద రాజన్న తొలి సంతకం చేశారు .2004 మే నెలకు ముందు జిల్లాలో 63,559 మంది బకాయిలు రద్దు చేశారు. అప్పటికే జిల్లా వ్యాప్తంగా 71,321 మంది రైతులకు ఉచిత విద్యుత్ అందించారు. జిల్లాలో రైతు భరోసా అందుకున్న రైతులు 2.96 లక్షల మంది ఉన్నారు. కూటమి నాయకులు తాము అధికారంలోకి వస్తే ప్రతి రైతుకు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ప్రతి రైతుకు ఏడాదికి రూ.20 వేలు ఇస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటి వరకు దాని ప్రస్తావన కూడా లేదు. నాడు హామీ ఇచ్చిన దాని ప్రకారం రైతులకు తొలి ఏడాది రూ.5,92,00,00,000 ఎగనామం పెట్టారు. జిల్లాలో మిర్చి, పొగాకు, పత్తి, శనగ, ధాన్యం, మామిడి ఇలా దేనికీ కనీస మద్దతు ధరలేక రైతులు అల్లాడిపోతున్నారు.

గుండ్లకమ్మకు నిధుల వరద...

జిల్లాలోని మల్లవరం ప్రాజెక్టుకు వైఎస్సార్ పాలనలోనే నిధుల వరద పారింది. గుండ్లకమ్మ నదిపై 3.859 టీఎంసీల సామర్థ్యం కలిగిన ప్రాజెక్టుకు రూపకల్పన చేసి రూ.543.43 కోట్లు కేటాయించి పనులు చేపట్టారు. ఫలితంగా 9 మండలాల పరిధిలో 84 వేల ఎకరాలకు సాగునీరందుతోంది. ఒంగోలు ప్రజల దాహార్తిని తీర్చడమే కాకుండా పరిసరాల్లోని 43 గ్రామాల పరిధిలోని 2.56 లక్షల మందికి తాగునీరందించేలా నిర్మించారు. రామతీర్థ జలాశయం నిర్మించి 70 వేల ఎకరాలకు సాగునీటితో పాటు వేలాది మందికి తాగునీరు అందించారు. రాజన్న తరువాత నిర్లక్ష్యానికి గురైన మల్లవరం ప్రాజెక్టుకు క్యాడ్ వాం పనుల కింద రూ.100 కోట్లను నాటి సీఎం వైఎస్ జగన్ మంజూరు చేశారు.



ఒంగోలులోని రిమ్స్ వైద్యశాల

వైద్య రంగంలో ఆరోగ్య శ్రీ విప్లవం...

వైద్యారోగ్య రంగంలో వైఎస్ రాజశేఖర రెడ్డి తీసుకొచ్చిన ఆరోగ్య శ్రీ, 108, 104 లాంటివి ఎందరో నిరుపేదల ఆరోగ్యానికి భరోసా ఇచ్చాయి. జిల్లాలో 43 కార్పొరేట్ ఆస్పత్రులు, 64 పీహెచ్‌సీలు, 11 సెకండరీ హెల్త్ ఆస్పత్రులు ఆరోగ్య నెట్‌వర్క్ ఆస్పత్రులుగా వైద్య సేవలు అందిస్తున్నాయి. వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చాక ఆరోగ్య శ్రీ పథకాన్ని రూ.25 లక్షల వరకు పెంచారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చీ రాగానే ఆరోగ్య శ్రీని ఎత్తివేసేందుకు కుట్రలు మొదలు పెట్టింది. ఆస్పత్రులకు సకాలంలో బిల్లులను చెల్లించకుండా వేధిస్తోంది. ఆరోగ్య శ్రీని బీమా కిందకు తీసుకొచ్చేందుకు నిర్ణయం తీసుకుంది. ఇది అమలులోకి వస్తే నిరుపేదలకు ఆరోగ్య శ్రీ సేవలు దూరమైనట్టే.



మార్కాపురంలో మధ్యలో నిలిచిపోయిన మెడికల్ కాలేజీ

మేరు నగధీరుడు వైఎస్సార్

- నేడు మహానేత వైఎస్సార్ జయంతిని జయప్రదం చేద్దాం
- వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి

ఒంగోలు సిటీ: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో తనదంటూ ఓ ప్రత్యేక అధ్యాయాన్ని సృష్టించుకున్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రజలు జీవితకాలం గుర్తుంచుకోదగ్గ మేరు నగధీరుడు అని ఒంగోలు పార్లమెంట్ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి కొనియాడారు. నేడు వైఎస్సార్ 76వ జయంతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలని సోమవారం ఆయన పిలుపునిచ్చారు. బత్తుల మాట్లాడుతూ సుదీర్ఘ పాదయాత్రలో పేదవాడి గుండెచప్పుడు పసిగట్టిన దార్శనికుడు వైఎస్సార్ అని అన్నారు. వృత్తిపరంగా వైద్యుడైనా ధనిక, పేద వర్గాల మధ్య తారతమ్యాలను గుర్తించి ఆరోగ్యశ్రీ పేరుతో కార్పొరేట్ వైద్యం పేదల దరి చేర్చారన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో కార్పొరేట్ విద్య, 108 సేవలు ఆయన వల్లే పురుడు పోసుకున్న విషయాన్ని ఆయన రాజకీయ వైరులు సైతం స్వాగతించారన్నారు. నేడు వీధికి ఒక ఎన్నారై, ప్రతి పేదవాడి ఇంట ఒక సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఉన్నారంటే అది నాడు వైఎస్సార్ దార్శనికత వల్లే సాధ్యమైందని చెప్పారు. వ్యవసాయాన్ని సంస్కరణల బాట పట్టించి 82 నీటిపారుదల ప్రాజెక్టులను ప్రారంభించి అపర భగీరథునిగా వైఎస్సార్ నిలిచారన్నారు. ఎరువులు, విత్తనాలు సబ్సిడీతో అందించి, రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించి వ్యవసాయాన్ని పండగ చేశారని చెప్పారు. విలువలతో కూడిన వ్యక్తిత్వంతో ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. రైతు పక్షపాతిగా, రాజకీయాల్లో మాటతప్పని, మడమ తిప్పని నేతగా నిలిచిన వైఎస్సార్ బాటలో నడుస్తున్న ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వెన్నంటి ఉండి దివంగత నేతకు నివాళులర్పిద్దామని పిలుపునిచ్చారు.



బత్తుల బ్రహ్మానందరెడ్డి

తగ్గుతున్న పొగాకు సరాసరి ధరలు

టంగుటూరు: ధరలు పెరగటం దేవుడెరుగు కానీ రోజు రోజుకీ తగ్గుతున్న పొగాకు సరాసరి ధరలు చూసి రైతులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక పొగాకు వేలం కేంద్రంలో సోమవారం నిర్వహించిన వేలంలో పొగాకు సరాసరి రూ.221.67 గా నమోదైంది. ఎం.నిడమానూరు గ్రామానికి చెందిన రైతులు వేలానికి 912 బేళ్లను తీసుకురాగా వాటిలో 170 బేళ్లు తిరస్కరించారు. గరిష్ట ధర రూ.280 కాగా, కనిష్ట ధర రూ.160, సరాసరి ధర రూ.221.67 పలికింది.

మంత్రి స్వామికి సమస్యల స్వాగతం

సింగరాయకొండ:

మండలంలోని సోమరాజుపల్లి పంచాయతీ టీపీ నగర్, అప్పాపురం ఎస్టీకాలనీలో సోమవారం రాత్రి రాష్ట్ర సాంఘిక, సంక్షేమ శాఖామంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి నిర్వహించిన సుపరిపాలనకు తొలిఅడుగు కార్యక్రమంలో గ్రామస్తుల నుంచి సమస్యలు స్వాగతం పలికాయి. పింఛన్ మంజూరు కాలేదని, తల్లికి వందనం డబ్బులు రాలేదని, ఇళ్లు మంజూరు కాలేదని పలువురు ప్రజలు మంత్రికి ఏకరువు పెట్టారు. ఆధార్‌కార్డు లేక ప్రభుత్వ పథకాలు రావడం లేదని, ఆధార్‌కార్డు మంజూరు చేయించాలని ఎస్టీలు మంత్రికి విన్నవించుకున్నారు. వెంటనే పరిశీలించి సమస్యలు పరిష్కరించాలని మంత్రి స్వామి అధికారులకు సూచించారు. టీపీ నగర్, అప్పాపురంలో సుమారు 1300 గృహాలుండగా, మంత్రి స్వామి కేవలం 300 గృహాలే తిరిగారని, తమ గృహాలకు రాలేదని టీపీ నగర్ కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు.



మంత్రికి సమస్యలు తెలుపుతున్న మహిళ

పోస్టుమార్టం రూము రిపేర్లకు రూ.10 లక్షలు



సాక్షిలో ప్రచురితమైన వార్త





నాడు అలా... నేడు ఇలా...

సాక్షి ఎఫెక్ట్..

మార్కాపురం: మార్కాపురం జీజీహెచ్‌లోని పోస్టుమార్టం గది, విద్యుత్ మార్చురీ గదుల మరమ్మతులకు ప్రభుత్వం రూ.10 లక్షలు మంజూరు చేయడంతో పనులు పూర్తికావచ్చాయి. ఈ ఏడాది మే 2న సాక్షిలో 'అమ్మో ఆ గదా'.. శీర్షికన జీజీహెచ్‌లో శిథిలావస్థకు చేరిన పోస్టుమార్టం గది, విద్యుత్ మార్చురీ గదుల దుస్థితిపై వార్త ప్రచురితమైంది. దీనికి స్పందించిన వైద్యారోగ్య శాఖాధికారులు గత నెలలో రూ.10 లక్షలు మంజూరు చేయడంతో మార్చురీ రూము, పోస్టుమార్టం రూములకు మరమ్మతులు చేయడంతోపాటు రంగులు వేసి లోపల టైల్స్ కూడా బిగించారు. పోస్టుమార్టం రూము, విద్యుత్ మార్చురీ రూము పనులు త్వరలో పూర్తికావస్తున్నాయని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రామచంద్రరావు తెలిపారు.

క్లుప్తంగా

ఎక్సైజ్ అధికారుల తనిఖీలు


ఎం.నిడమానూరులో తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ సీఐ లీనా

సాక్షి ఎఫెక్ట్..

టంగుటూరు: మండలంలోని ఎం.నిడమానూరు, పొందూరు గ్రామాల్లో ఒంగోలు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ లీనా, ఎస్సై గీత వారి సిబ్బందితో కలిసి సోమవారం తనిఖీలు నిర్వహించారు. ద్విచక్ర వాహనంపై మద్యం విక్రయించడం గురించి.. మంత్రి ఇలాకాలో మొ'బైక్' మద్యం అనే శీర్షికతో సోమవారం సాక్షి దినపత్రిక మెయిన్ పేజీలో ప్రచురితమైన కథనానికి జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు స్పందించారు. వారి ఆదేశాల మేరకు సీఐ, ఎస్సైలు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ లీనా మాట్లాడుతూ ఎక్కడైనా అనధికారికంగా మద్యం నిల్వ చేయడం, విక్రయించడం చేస్తే సంబంధిత వ్యక్తులపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిషేధిత మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలు, అనధికారికంగా మద్యం నిల్వలు, విక్రయాలపై తమకు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. కాగా, ఆదివారం బైక్‌పై మద్యం విక్రయించిన వ్యక్తిని టంగుటూరు ఎస్సై అదుపులోకి తీసుకుని తహసీల్దార్ వద్ద బైండోవర్ చేసినట్లు తెలిపారు.

కార్లు అద్దెకు తీసుకుని వేధిస్తున్నారని ఫిర్యాదు

ఒంగోలు టౌన్: తన కార్ ట్రావెల్స్‌లో మూడు కార్లు అద్దెకు తీసుకుని అద్దె చెల్లించకుండా, తిరిగి ఇవ్వకుండా వేధిస్తున్నారంటూ బాధితుడు సోమవారం ఎస్పీ దామోదర్‌కి ఫిర్యాదు చేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన ఒంగోలు మారుతీనగర్‌కు చెందిన వ్యక్తి.. తాను కార్ ట్రావెల్స్ నిర్వహిస్తూ జీవిస్తుండగా, ఒంగోలు సమతా నగర్‌కు చెందిన వ్యక్తి మూడు కార్లను అద్దెకు తీసుకున్నాడని, ఏడు నెలలైనా ఒక్క రూపాయి అద్దె చెల్లించకుండా కార్లను కూడా ఇవ్వకుండా వేధిస్తున్నాడని ఎస్పీకి ఫిర్యాదు చేశారు. మొత్తం 79 ఫిర్యాదులు రాగా, బాధితులు ఎస్పీని కలిసి తమ గోడు వెల్లబోసుకున్నారు.


అడుగంటి పోతున్న కంభం చెరువు (ప్రస్తుతం 5 అడుగులు ఉన్న నీటిమట్టం)


గోవిందాపురం సమీపంలో చెరువు నీళ్లతో చిన్నపాటి చెరువులను తలపిస్తున్న బీడుభూములు


పెద్దకంభం తూములనుండి లీకేజ్ ద్వారా పంటకాల్వల్లో పారుతున్న నీళ్ళు

అడుగంటిన ఆశలు

ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యంతో చారిత్రాత్మక కంభం చెరువు అడుగంటుతోంది. వర్షాలు లేక చెరువు నీళ్లు 5 అడుగులకు పడిపోగా.. ఉన్న నీటినీ ఇరిగేషన్ అధికారులు తూములెత్తి వదిలేయడంతో ఆ నీరు తూముల లీకేజీల ద్వారా వృథాగా పోతోంది. చెరువులో నీరు లేకపోవడంతో పరిసర గ్రామాల్లో భూగర్భ జలాలు అడుగంటే ప్రమాదం పొంచి ఉంది. ఉన్న కొద్దిపాటి నీళ్లనూ కాపాడుకోవడంలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

- అడుగంటుతున్న చారిత్రాత్మక కంభం చెరువు నీటిమట్టం
- గతంలో పది అడుగుల నీళ్లున్నా రైతులకు నీళ్లొదలని ఇరిగేషన్ అధికారులు
- ప్రస్తుతం 5 అడుగులుంటేనే తూములెత్తేసిన వైనం
- ఇప్పటికే తూముల లీకేజి ద్వారా వృథాగా వెళ్లిపోతున్న నీళ్లు
- భూగర్భ జలాలు అడుగంటే ప్రమాదం

కంభం చెరువు నీటి సామర్థ్యం: 3.30 టీఎంసీలు

ప్రస్తుతం చెరువులో ఉన్న నీటి మట్టం: 5 అడుగులు

సాగు విస్తీర్ణం: అధికారికంగా 6944 ఎకరాలు

అనధికారికంగా 12 వేల ఎకరాలు

కంభం: ఆసియా ఖండంలోనే రెండో అతి పెద్దదైన కంభం చెరువు నిండితే మూడేళ్ల వరకు ఆయకట్టు కింద అధికారికంగా 6944 ఎకరాలు, అనధికారికంగా 12 వేల ఎకరాలు సాగులో ఉండేది. ప్రస్తుతం సకాలంలో వర్షాలు కురవకపోవడంతో చెరువులో నీళ్లు చేరే పరిస్థితులు కనబడటంలేదు. మే నెలలో అడపా దడపా భారీ వర్షాలు కురిసినా కంభం చెరువుకు నీరుచేరే నల్లమల అటవీ ప్రాంతంలో కురవకపోవడంతో చెరువుకు నీళ్లు చేరలేదు.

నీటికష్టాలు తప్పవా:

కంభం చెరువులో నీళ్లుంటే చుట్టుపక్కల 20 కిలోమీటర్ల వరకు భూగర్భ జలాలు పుష్కలంగా ఉండి ఆ గ్రామాల్లో నీటి సమస్య ఉండదు. ప్రస్తుతం చెరువులో 5 అడుగుల మేర నీళ్లు ఉండగా ఇరిగేషన్ అధికారులు తూము ఎత్తడంతో నీటి మట్టం తగ్గిపోతోంది. ఇప్పటికే మండలంలోని పలు గ్రామాల్లో నీటి సమస్య తలెత్తుతోంది. గతంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో నీటి సమస్య తీవ్రంగా ఉండటంతో ట్యాంకర్ల ద్వారా ప్రజలకు నీళ్లు అందించారు. ట్యాంకర్ల ద్వారా టీడీపీ నాయకులు భారీగా డబ్బులు సంపాదించుకున్నారన్న విమర్శలు అప్పట్లో తీవ్రంగా వినిపించేవి. ఆ తర్వాత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వర్షాలు పుష్కలంగా పడి కంభం చెరువులో కొంత మేర నీళ్లు చేరడంతో ట్యాంకర్ల అవసరం లేకుండానే ఐదేళ్లు ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా నీళ్లు అందించారు. ప్రస్తుతం చెరువు నీళ్లు అడుగంటి పోతుండటంతో వర్షాలు పడకపోతే భూగర్భ జలాలు అడుగంటితే మళ్లీ ట్యాంకర్ల మీద ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

అప్పుడలా..ఇప్పుడేమో ఇలా..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో కంభం చెరువులో సుమారు 10 అడుగుల నీళ్లున్నప్పటికీ పంటల సాగుకు రైతులకు నీళ్లు వదిలితే చెరువు ఎండిపోయి భూగర్భ జలాలు అడుగంటిపోతాయన్న ఉద్దేశంతో జిల్లా ఉన్నతాధికారులు పొలాలకు నీళ్లు వదిలేందుకు అనుమతించలేదు. తమ పంటలు ఎండిపోతున్నాయని రైతులు మొరబెట్టుకున్నా తూములు ఎత్తేందుకు ససేమిరా అన్నారు. ప్రస్తుతం కంభం చెరువులో నీటి మట్టం 5 అడుగులకు పడిపోయి అడుగంటుతున్నా దర్గా గ్రామంలో కేవలం 70 ఎకరాల్లో సాగులో ఉన్న పత్తి పంట కోసం రెండుసార్లు చిన్నకంభం తూములు ఎత్తడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వృథాగా పోతున్న కంభం చెరువు నీళ్లు:

ఇప్పటికే చిన్నకంభం, పెద్దకంభం, నక్కల గండి తూముల వద్ద లీకేజీల ద్వారా చాలా వరకు నీళ్లు వృథాగా వెళ్లిపోతున్నాయి. వాటిని అరికట్టడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఇరిగేషన్ అధికారులు చెరువులో ఉన్న కొద్దిపాటి నీళ్లను కాపాడుకోవడంలేదన్న విమర్శలు వస్తున్నాయి. దర్గా గ్రామంలో రైతుల కోసం నీళ్లు వదలగా ఆ నీళ్లు చిన్నకంభం, గోవిందాపురం గ్రామాల మీదుగా పంటకాల్వల గుండా వెళ్తున్నాయి. దారి పొడవునా పంటల కాల్వలు సక్రమంగా లేకపోవడంతో గోవిందాపురం సమీపంలో ఉన్న పలు బీడు భూములు చెరువు నీళ్లతో నిండిపోయి చిన్నపాటి చెరువులను తలపిస్తున్నాయి. ఇన్ని నీళ్లు వృథాగా వెళ్లిపోతున్నా ఇరిగేషన్ అధికారులు మాత్రం పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. నక్కల గండి తూమును సైతం రాత్రి వేళల్లో పలువురు అక్రమంగా ఎత్తుకొని పొలాలకు నీళ్లు పెట్టుకుంటున్నారు.


చిన్నకంభం తూము ఎత్తడంతో వెళ్తున్న నీళ్ళు


ఇరిగేషన్ కాలువల్లో దర్గా గ్రామంవైపు పారుతున్న నీళ్ళు


పెద్దకంభంతూము వద్ద లీకేజి

నీరు వృథాకాకుండా చూడాలి



కంభం చెరువు నీళ్లు వృథా కాకుండా ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలి. చెరువులో నీళ్లు అయిపోతే భూగర్భ జలాలు అడుగంటే ప్రమాదం ఉంది. అప్పుడు మండలంలో నీటి సమస్య తలెత్తుతుంది. చెరువు నీళ్లు వృథాగా వెళ్లకుండా ఇరిగేషన్ అధికారులు దృష్టి సారించాలి.

– చేగిరెడ్డి తులశమ్మ, ఎంపీపీ కంభం

దర్గా రైతుల కోసం తూములు ఎత్తాం

దర్గా గ్రామంలో పత్తి రైతులకు నీళ్లు కావాలని అడిగితే చిన్నకంభం తూములు ఎత్తాం. 15 రోజుల క్రితం ఒకసారి, ప్రస్తుతం రెండో సారి తూములు ఎత్తాం. నీళ్లు వృథాగా వెళ్లకుండా చర్యలు తీసుకుంటాం.

– శ్రీను నాయక్, ఇరిగేషన్ ఏఈ, కంభం

గ్రామంలో ఇప్పటికే నీటి సమస్య ఉంది



సూరేపల్లి గ్రామంలో ఎప్పుడూ నీటి సమస్య ఉంటుంది. చెరువులో నీళ్లున్నా 500 అడుగులకు పైగా బోర్లు వేసినా నీళ్లు పడని పరిస్థితి. చెరువు ఎండిపోతే ఎన్ని అడుగులు వేసినా ఈ గ్రామంలో నీళ్లు పడవు. అధికారులు నీటి సమస్య తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి.

– బిజ్జం వెంకటేశ్వరరెడ్డి, సూరేపల్లి

వాకర్స్‌కు మంచినీటి సౌకర్యం కల్పించాలి

- ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జేసీకి వినతిపత్రం
- నిర్దేశించిన సమయంలోగా సమస్యలు పరిష్కరించాలని అధికారులకు జేసీ ఆదేశం


అర్జీదారులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ గోపాలకృష్ణ

ఒంగోలు సబర్బన్: ఒంగోలు నగరంలోని మామిడిపాలెం ఎస్ఎస్ ట్యాంక్–1 కట్టపై వాకర్స్ కోసం మంచినీటి సదుపాయం కల్పించాలని కోరుతూ ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్ అసోసియేషన్ ప్రతినిధులు జాయింట్ కలెక్టర్, జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణను కలిసి వినతిపత్రం అందజేశారు. సోమవారం ఒంగోలు కలెక్టరేట్‌లోని మీ కోసం సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో జేసీని కలిసి విజ్ఞప్తి చేశారు. వాకర్స్‌కు మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేస్తే ఎంతోమందికి ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. ఎస్ఎస్ ట్యాంకుపై మంచినీటి సదుపాయం కోసం జూన్ 23, 2025న ఒకసారి, జూన్ 30, 2025 మరోసారి జిల్లా కలెక్టర్‌కు మీ కోసం కార్యక్రమంలో అర్జీ సమర్పించామని చెప్పారు. ఎస్ఎస్ ట్యాంక్ కట్ట మీద నాలుగు చోట్ల షెడ్లు, బెంచీలు, టాయిలెట్లు కూడా ఏర్పాటు చేయాలని విన్నవించారు. సమస్య పరిష్కారానికి త్వరలో చర్యలు చేపడతామని జేసీ హామీ ఇచ్చారు.

నిర్దేశించిన సమయంలో సమస్యలు పరిష్కరించాలి...

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన అర్జీలను నిర్దేశించిన సమయంలోగా శాశ్వతంగా పరిష్కరించాలని జేసీ, ఇన్‌చార్జ్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ అధికారులను ఆదేశించారు. డీఆర్వో చిన ఓబులేసు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు వరకుమార్, శ్రీధర్, జాన్సన్, పార్థసారధి, విజయజ్యోతితో కలిసి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక వ్యవస్థ ద్వారా అందిన దరఖాస్తులకు మెరుగైన పరిష్కారాన్ని చూపాలన్నారు. నిబంధనల మేరకు ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని, నిబంధనల మేరకు లేని దరఖాస్తులకు సంబంధిత కారణాలను స్పష్టంగా దరఖాస్తుదారుడికి తెలియజేయాలని సూచించారు. వివిధ శాఖల్లో నమోదైన అర్జీలను సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి సమస్యకు తగిన పరిష్కారం చూపాలని స్పష్టం చేశారు. అర్జీల పరిష్కార ప్రగతిని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కూడా జేసీ ఆదేశించారు.

తండ్రిపై హత్యాయత్నం కేసులో కుమారుడికి రిమాండ్

టంగుటూరు: తండ్రిపై హత్యాయత్నం కేసులో నిందితుడైన కుమారుడికి రిమాండ్ విధించారు. ఈ కేసుకు సంబంధించి టంగుటూరు ఎస్సై నాగమల్లేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. టంగుటూరు మండలం ఆలకూరపాడు గ్రామానికి చెందిన దివి చందు కొంత కాలం నుంచి చెడు వ్యసనాలకు బానిసై ఇంట్లో తల్లిదండ్రులను డబ్బుల కోసం ఇబ్బంది పెడుతూ ఉన్నాడు. దీనిపై జూన్ 12వ తేదీ అతని తల్లిదండ్రులు దివి వెంకటరావు, దివి లక్ష్మి ఫిర్యాదు చేశారు. డబ్బుల కోసం తమను చందు ఇబ్బంది పెడుతూ కొట్టినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. తనకు అడిగినప్పుడల్లా డబ్బులివ్వకపోతే చంపుతానని బెదిరించినట్లు చెప్పారు. అతనికి భయపడి బంధువుల ఇంటి వద్ద ఉంటున్నామన్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 3వ తేదీ పెన్షన్ కోసం ఆలకూరపాడు గ్రామానికి దివి వెంకటరావు, దివి లక్ష్మి రాగా, రాత్రి 8.45 గంటల సమయంలో ఇంటికొచ్చిన చందు.. తన తండ్రి దివి వెంకటరావుతో గొడవపడ్డాడు. అతన్ని చంపాలనే ఉద్దేశంతో కర్ర తీసుకుని తలపై కొట్టగా తీవ్రగాయమైంది. వెంటనే ఒంగోలు జీజీహెచ్‌కి స్థానికులు తరలించారు. క్షతగాత్రుడి భార్య దివి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆమె కుమారుడు దివి చందుపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. సోమవారం అతన్ని అరెస్టు చేసి సింగరాయకొండ కోర్టులో జడ్జి ముందు హాజరుపరచగా, 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్సై వివరించారు.

ఏకేయూ కళాశాల నూతన ప్రిన్సిపాల్‌గా నిర్మలామణి


ప్రొఫెసర్ నిర్మలామణి

ఒంగోలు సిటీ: మూడేళ్ల క్రితం ఏర్పడిన ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉన్న యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ ఎస్.నిర్మలామణి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె ఇప్పటి వరకు వైస్ ప్రిన్సిపాల్‌గా పనిచేశారు. ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనపై యూనివర్సిటీ ఉన్నతాధికారులు ఉంచిన బాధ్యతలను సక్రమంగా నిర్వహించడమే కాకుండా తన పదవీ కాలంలో ప్రభుత్వ నిబంధనలకు లోబడి బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించి యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ పదవికి వన్నె తెస్తానని అన్నారు. విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కృషి చేస్తానన్నారు. ఏకేయూ ఉప కులపతి, ప్రొఫెసర్ డీవీఆర్ మూర్తి సూచనల మేరకు ఏకేయూ కళాశాల ప్రిన్సిపాల్‌గా తనను నియమించిన రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.హరిబాబుకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. నూతన ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నిర్మలామణిని సహచరులైన ఆంధ్రకేసరి యూనివర్సిటీ ఓఎస్డీ, పూర్వపు ఏకేయూ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ గుత్తి రాజమోహన్‌రావు, ఏకేయూ పరీక్షల నియంత్రణ అధికారి (సీఈ), ఏకేయూ వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.సోమశేఖర్‌తో పాటు ఆంధ్రకేసరి యూనివర్సిటీకి చెందిన బోధన, బోధనేతర సిబ్బంది కలిసి అభినందనలు తెలిపారు.

మామిడికాయల లోడు వాహనం బోల్తా


మద్దిపాడు ఫ్లైఓవర్ సమీపంలో బోల్తాపడిన మామిడికాయల లోడు వాహనం

మద్దిపాడు: మామిడికాయల లోడుతో వెళ్తున్న 407 వాహనం జాతీయ రహదారిపై మద్దిపాడు సమీపంలో బోల్తాపడింది. సోమవారం ఉదయం చోటుచేసుకున్న ఈ సంఘటన వివరాల ప్రకారం.. చిత్తూరు నుంచి మామిడికాయల లోడుతో విజయవాడ వైపు వెళ్తున్న 407 వాహనం మద్దిపాడు సమీపంలోకి వచ్చేసరికి ముందు టైరు పేలిపోయి అదుపు తప్పి తిరగబడింది. వాహనంలోని మామిడి కాయలు మొత్తం రోడ్డుపై పడిపోయాయి. సమాచారం అందుకున్న మద్దిపాడు పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. అప్పటికే అక్కడ గుమిగూడిన ప్రజలను అదుపుచేశారు. వాహనం నడుపుతున్న వ్యక్తికి ఎటువంటి గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

10న మెగా టీచర్-పేరెంట్ మీటింగ్

- మెగా టీచర్–పేరెంట్ మీటింగులపై ఇన్‌చార్జ్ కలెక్టర్ గోపాలకృష్ణ సమీక్ష
- అదే రోజు ప్రతి పాఠశాల, కళాశాలలో మొక్కలు నాటాలని ఆదేశం


అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ గోపాలకృష్ణ

ఒంగోలు సబర్బన్: మెగా టీచర్ – పేరెంట్ మీటింగులను జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ఘనంగా పండుగ వాతావరణంలో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జ్ కలెక్టర్, జేసీ ఆర్.గోపాలకృష్ణ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి నియోజకవర్గ, మండల స్థాయి ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మండల విద్యాశాఖాధికారులతో వర్చువల్‌గా సమీక్షించారు. ఈ నెల 10న జిల్లాలో జరగనున్న మెగా టీచర్–పేరెంట్ మీటింగ్ ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పిల్లలందరికీ నాణ్యమైన విద్య అందించడానికి విద్యార్థుల సంపూర్ణ అభివృద్ధిని నిర్ధారించడానికి పాఠశాల విద్య, సమాజ భాగస్వామ్యంతో రాష్ట్ర వ్యాప్తంగా మెగా పేరెంట్స్–టీచర్స్ మీటింగులను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా జిల్లాలోని మొత్తం 2,955 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, 188 జూనియర్ కళాశాలల్లో మీటింగులు నిర్వహించనున్నట్లు చెప్పారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ప్రజాప్రతినిధులను ఈ కార్యక్రమానికి ఆహ్వానించాలని సూచించారు. అలాగే పూర్వ విద్యార్థులు, అక్కడ చదివి ఉన్నత స్థానాల్లో నిలిచిన వారిని కూడా ఆహ్వానించి సన్మానించాలని సూచించారు. కార్యక్రమానికి విద్యార్థులందరూ యూనిఫాంలో వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. పిల్లలలోని సృజనాత్మకతను వెలికితీసేలా పోటీలు నిర్వహించాలన్నారు. తల్లిదండ్రులకు కూడా పోటీలు నిర్వహించి బహుమతులు అందించాలన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో కూడా మెగా పేరెంట్స్ మీట్ నిర్వహించేలా యాజమాన్యాలతో సమావేశం నిర్వహించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఈఓ కిరణ్‌కుమార్, ఆర్ఐఓ సైమన్ విక్టర్, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ లక్ష్మానాయక్, జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు, జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఎస్.శ్రీనివాసరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పట్టపగలే ఇంట్లో చోరీ

టంగుటూరు: పట్టపగలే ఓ ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీచేసిన సంఘటన శుక్రవారం జరగ్గా, సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. టంగుటూరు మండలంలోని జయవరం గ్రామంలో జరిగిన ఈ సంఘటనకు సంబంధించి బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన ఇత్తడి వినోద్‌కుమార్ ఆటో నడుపుతూ జీవిస్తున్నాడు. అతని భార్య అంగన్‌వాడీ కార్యకర్తగా పని చేస్తోంది. ఈ నెల 4వ తేదీ పనుల నిమిత్తం ఇంటికి తాళం వేసి వెళ్లారు. తిరిగి సాయంత్రం వచ్చి చూడగా, ఇంటి తాళం పగలకొట్టి ఉంది. ఇంట్లో పరిశీలించగా దుస్తులు, వస్తువులు చల్లాచెదురుగా పడి ఉన్నాయి. బీరువా పగలకొట్టి అందులోని రూ.92 వేల నగదు, మూడు సవర్ల బంగారు నల్లపూసల దండ, ఉంగరం, చెయిన్‌ను చోరీ చేశారు. దీనిపై పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేయగా, క్లూస్ టీం వచ్చి వేలిముద్రలు సేకరించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగమల్లేశ్వరరావు తెలిపారు.


బీరువా తెరిచి చెల్లాచెదురుగా పడేసిన వస్తువులు

ఎమ్మార్పీఎస్ పోరాటంతోనే ఎస్సీ వర్గీకరణ

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు బ్రహ్మయ్యమాదిగ


కార్యక్రమంలో మాట్లాడుతున్న బ్రహ్మయ్యమాదిగ

ఒంగోలు వన్‌టౌన్: ఎమ్మార్పీఎస్ 30 సంవత్సరాల అలుపెరుగని పోరాటం ద్వారానే ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు ఉసురుపాటి బ్రహ్మయ్యమాదిగ అన్నారు. ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఒంగోలు నగరంలో సోమవారం సాయంత్రం భారీ ర్యాలీ నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణ అమలు చేసిన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలకు ధన్యవాదాలు తెలుపుతూ నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా స్థానిక నెల్లూరు బస్టాండ్ సెంటర్‌లోని మున్సిపల్ ఓపెన్ ఆడిటోరియంలో మాదిగ మహామేళా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మయ్యమాదిగ మాట్లాడుతూ 30 సంవత్సరాల మాదిగల ఆశ, ఆకాంక్ష నెరవేరిందన్నారు. 1994 నుంచి 2024 వరకూ ఎస్సీ వర్గీకరణ పోరాటం జరిగిందన్నారు. 1994 జూలై 7వ తేదీ జిల్లాలోని నాగులుప్పలపాడు మండలం ఈదుమూడిలో ఎస్సీ వర్గీకరణ కోసం 20 మందితో ఎమ్మార్పీఎస్‌ను ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. అనంతరం ఎమ్మార్పీఎస్ మాదిగ దండోరా పేరుతో ఉద్యమాన్ని సాగించామన్నారు. పార్లమెంటులో చట్టం చేయాలనే డిమాండ్‌తో 2004 నుంచి 2023 వరకూ నిత్యం ఉద్యమం నిర్వహించామన్నారు. ఢిల్లీ వీధుల్లో కూడా వర్గీకరణ చేయాలని డిమాండ్ చేస్తూ ఉద్యమం నిర్వహించామన్నారు. కార్యక్రమంలో పలువురు ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఎస్పీ అభినందనలు

ఒంగోలు టౌన్: జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎస్పీ ఏఆర్ దామోదర్ అభినందించారు. కె.షణ్ముఖ సాయిరెడ్డి (ఈడబ్ల్యూఎస్ 2వ ర్యాంక్), ఎస్పీ సాయి చక్రి (ఈడబ్ల్యూఎస్ 3వ ర్యాంక్), షేక్ అబ్దుల్ రహీమ్ (ఈడబ్ల్యూఎస్ 40వ ర్యాంక్)లను జిల్లా పోలీసు కార్యాలయంలోని తన చాంబర్లో సోమవారం ఎస్పీ అభినందించారు. ఆయన మాట్లాడుతూ సమయ పాలన, సరైన ప్రణాళికతో చదివితే జీవితంలో ఉన్నత స్థానాలకు చేరవచ్చన్నారు. చదువులో ప్రతిభ చాటుతూ తల్లిదండ్రులు, జిల్లా, రాష్ట్రానికి మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.